
# స్నేహలేఖ!



శ్రీ. పి. హరిప్రసాదరావు

రాజా!

మీ పట్టణంలో జరిగిన సాహిత్య సభలకు రమ్మని నీవు ఎంతో ఆదరంగా ఆహ్వానించినా నేను రాలేదని నిందాపూర్వకంగా వ్రాసిన నీలేఖ అందింది. దానిని చదివి చాల విచారించాను. సాహిత్యసభలకు హాజరవలేకపోయినందుకు కాదు—ఒక ఆప్తమిత్రుని హృదయానికి బాధకలిగించినందుకు. కాని, నేనెందుకు రాలేదో తెలియజేస్తే నీహృదయబాధ వుపశమిస్తుందని యీలేఖ వ్రాస్తున్నా.

ముందు నిన్ను ప్రశ్నిస్తున్నా. ఆరెండురోజులూ వెళ్లి—ఆసాహిత్యోపన్యాసాలను విని—నీవు ఏమాత్రమైనా నేర్చుకోగలిగావా? లేదని నేను ఘంటాపథంగా చెబుతా.

ఏమంటే! నేడు మన ఆంధ్రదేశంలో జరుగుతూన్న సాహిత్యసభలలో పాల్గొనే కవి పండితులలో ఏ ఒకరిద్దరోతప్ప మిగతావారంతా ఒకరిమీదొకరు దుమ్మెత్తి పోసుకోవడమేకాని — పూర్వ సాహిత్యం ఎలావుండేది — ప్రస్తుతం ఎలావుంది—యికముందెలా వుండాలి—అని బోధచేసే వారొకరూ లేరు.

తిక్కన గొప్పవాడని ఒకరూ—నన్నయ్య లేకపోతే తెలుగు సాహిత్యమే అనేది లేదనేవారొకరూ వాదించుకునేందుకా యీ సాహిత్యసభలు? కాదు—నేడు దేశం యెలావుంది—అందు కనుగుణంగా సాహిత్యసేవ ఎలా చెయ్యాలి—ఇప్పుడిప్పుడు సాహిత్య క్షేత్రాన్ని సాగుచెయ్య మొదలుపెట్టిన యువకవులు ఏ ఆదర్శంతో దున్నడానికి నాగలి భుజాన వేసుకుంటే వారి సాగుబడి ఫలించి సస్యశ్యామలమవుతుందో తెలిపే వారెవరూ కనుపించరే! మరెందుకీ సభలూ యీ చర్చలూనూ?

మేమేదో పొడిచేస్తున్నాం —మావంటివారు మరెవరూ లేరు అనే అహంభావంతో మరొకడెవడైనా ఉదాత్తమైన సాహిత్యసృష్టికి పూనుకుని—దేశంలో కొంచెం పేరు ప్రఖ్యాతుల నార్జించుకుంటే అతనిని మెచ్చుకుని అతని సేవకు సహాయభూతులయ్యే బదులు అతనిని ఎలా అణగద్రొక్కుదామా అనే కుతంత్రాలుపన్నే యీ కవుల మహోపన్యాసాలు వినేదేమిటి?

మొన్న నొక కవిశ్రేష్ఠుడు చెప్పినట్లు—నేను యీ నెలలో ఆరుచోట్ల ఉపన్యాసవేదిక లెక్కితే నీవు-నీవు నాలుగుచోట్ల ఉపన్యాసాలిస్తే మరొకరూ-అరె నాకంటే వీడు ఎక్కువ వుపన్యాసాలిస్తున్నాడే-దేశంలో అందరి నోళ్లల్లోనూ నానుతున్నాడే-అని మథనపడేవారిని తెలుసుకుని మనం నేర్చుకునేదేమిటి?

ఇలా కాకుండా మీ పట్టణంలో జరిగిన సభలలో తప్పక వినదగిన ఉత్తమమైన వుపన్యాసం ఎవరైనా వినిపించారా? దానినిబట్టి నీవు యిప్పటికంటె అధికంగా నేర్చుకుని నీకృషిని ద్విగుణీకృతం చేసుకోగలవా? తెలియజేస్తే సంతోషిస్తా. అప్పుడు నేను రానందుకు నీవు నిందించినా ప్రయోజనముంది గాని-ఎందుకూ పనికిరాని యీ చెత్త వినడానికి అంత దూరం యీరైళ్లలో స్థలంలేక బాధపడి ఆర్థికంగా శారీరకంగా నష్టపోవడ మెందుకు?

దేశంలో కవులపరిస్థితు లిలావున్నాయి. ప్రజలకు కూడా సాహిత్యమందు ఏమాత్రం ఆసక్తి కనబడడంలేదు. నిజంగా ప్రజలలోనే ఆ ఆసక్తివుంటే మనకవులిలా వుండేవారు కారేమో!


ఇంక మన పరిస్థితి చూడు. అనేకవిధాలుగా ఎంతో బాధపడుతున్నా మనలో కలిగిన భావాలను చంపుకోలేక వాటిని కాగితంమ్మీద కెక్కిస్తాం. ఏదో పత్రికకు పంపుతాం. అందువలన మనకుకలిగే లాభం ఏమైనా వుంటుందా?

లేదు. ఎప్పటికో ఆ సంపాదకునికి దయకలిగినప్పుడు దానిని ప్రచురిస్తాడు. అది అసలు ప్రచు

రించబడిందో లేదో ఆ పత్రికను తిరగేస్తేనే కాని మనకు తెలియదు ఒక్కొక్కసారి. కారణం? మన రచన ప్రచురించబడిన పత్రిక కాపీ మనకురాదు. పత్రికను పంపడానికే నిర్లక్ష్యం చూపే యీ సంపాదకుల వద్దనుండి మనకు ప్రతిఫలం ఏం లభ్యమౌతుంది? పోనీ పాఠకుడైనా ఆ రచనను తన హృదయానికి అవగతం చేసుకుంటాడా అంటే అదీ శూన్యం, ఏదో ఉబుసుపోకకు పత్రిక కొంటాడు, దానిని చదివి ఒక మూలకు విసిరిపారేస్తాడు. అంతేగా రచయితలకు కలిగే లాభం.

ఇలాగంటే కళని వ్యాపారం చెయ్యొద్దు అని పెద్దలు కడుపునిండిన కబుర్లు చెబుతారు. కళని వ్యాపారం చెయ్యకపోతే తలంతా వేడెక్కేలా ఆలోచించి ఆలోచించి తన హృదయంలో ఎంతో బాధపడి రచించిన రచనలవలన ఏమాత్రమైనా ప్రతిఫలం లభించకపోతే ఆ రచయిత బ్రతకడం ఎలా? యీవిషయం ఎవరైనా ఆలోచించారా? రచయితగా బ్రతికి దుర్భరదారిద్ర్యానికి కారణభూతులయినవారు కూడా వున్నారని నేను ఒక సంఘటవలన తెలుసుకున్నా ఆదేమంటే!

మొన్నిమధ్య ఒకరు పెద్దపుస్తకాల కట్టనొకటితీసుకుని నావద్దకు వచ్చారు. ఆయన ముఖం చూడగానే ఎంతో సౌమ్యులుగా కనుపించారు. బక్కచిక్కిన దేహంతో మాసిపోయిన గుడ్డలతో ఆ కట్టను తీసుకొచ్చి నాఎదుట దింపి "యీ పుస్తకాలు కొంటారా?" అన్నాడు ఎంతోబాధతో. కట్టను విప్పిచూచా. అన్నీ ఖరీదైన యింగ్లీషు గ్రంథాలు. ఈనాడు వాటిఖరీదుకు నాల్గురెట్లధి

JAYAPRAKASH DIAMONDS

Rangoon Diamond Works,

Rani St., :: TRICHY.

జయప్రకాష్ వజ్రములు

చాలా ప్రకాశవంతమైనవి


మావద్ద నేర్పరులైన పనివారిచే తయారు చేయబడిన ఫేన్సీ రంగుల కమలములు దొరకును. వివరములకు వ్రాయండి. కేటలాగు ఉచితం.

తయారుచేయువారు:

ఎస్. పి. కేశవన్

రంగూన్ డైమండ్ వర్క్సు,

రాణిస్ట్రీట్, :: తిరుచినాపల్లి.



కంగా యిచ్చినా అవి లభ్యంకావడం దుస్సాధ్యం. సారస్వతంలో అధికశ్రేణికి చెందినవారు రచించిన అత్యుత్తమ గ్రంథాలవన్నీను. అన్నింటిమీద "సుందర్" అని చక్కగా లిఖించివుంది. అటువంటి అమూల్యగ్రంథాలు కొని చదివిన ఆ కళాప్రియుడెవరో తెలుసుకో అభిలషించి "ఎక్కడివండీ యివన్నీను?" అని అడిగా.

ఆ పెద్దమనిషి బాధతో చెప్పలేక "నావేనండీ' అన్నాడు.

"మీ పేరు?"

"సుందర్"

"ఏం పనిచేస్తారు?"

"పనేమీ లేదు"

ఒకానొక నాడు ఆంధ్రదేశ కథకులలో సుప్రసిద్ధుడని పేరుగడించిన "సుందర్" జ్ఞాపకానికొచ్చాడు. అతడు యీతడేనేమో అనే అనుమానంతో "మీరు కథలేమైన వ్రాసేవారా?" అని ప్రశ్నించా.

''ఆ-ఏదో వెనుక—అప్పుడప్పుడు'' అన్నాడు చాలబాధతో.

ఆమాట వినడంతోనే నేను క్రుంగిపోయాను. దేశంలో ఒకానొక నాడు ఎవరికథల కోసరం పాఠకులు ఆతురత జెందేవారో—ఆ కథకుడైన సుందర్ యీనాడు ఎంతో ఆసక్తితో కొనుక్కొని యెంతో విజ్ఞానాన్ని సంపాదించుకున్న అమూల్య గ్రంథాలను గతిలేక అమ్ముకుంటానికి సిద్ధపడ్డాడంటే కారణం ఏమిటి?

అతనిపరిస్థితి యేమిటో తెలుసుకోవాలని నా మనస్సాతురత జెందింది.

"ఈ గ్రంథాలను చూస్తుంటే ఒకానొక నాడు ఎంత అభిలాషతో మీరు వీటిని కొన్నారో అంత బాధతోనే వీటిని అమ్మజూపుతున్నారనుకుంటాను. ఇటువంటి అమూల్యమైన గ్రంథాలను మీవంటి సుప్రసిద్ధకథకులు అమ్మవలసిన పనేమిటి?'' అన్నాను.

''మీరు ఊహించింది నిజమే. నేను ఒకానొక నాడు సుప్రసిద్ధకథకుడనే. కాని, యీనాడు చేతిలో దమ్మిడీలేని దరిద్రుడను. ఏంలాభం? సుందర్ అనే కథకుడొకడుండేవాడనేమాట యిప్పుడెవరికీ జ్ఞాపకంలేదు మీవంటివారెవరికోతప్ప. జరిగిపోయిన గాథను త్రవ్వి మిమ్ములను బాధపెట్టడమెందుకు?''

''నాకు బాధేమీలేదు. మీరింత దౌర్భాగ్యదశకు రావడానికి కారణమేమిటో తెలుసుకునేందుకు ఆసక్తితోనున్నాను. మరోవిధంగా భావించకండి. మీఆప్తునిగా భావించి మీకథ తెలియజేస్తే కృతజ్ఞుడను''

''లోకానికి కథలను వినిపించే కథకుని కథ తెలుసుకోవాలనివుందా మీకు. సరే వినండి.

''నేను పల్లెటూరి రైతుకుటుంబంలో పుట్టాను. మాతండ్రి తనకున్న పదిఎకరాల మాగాణి సేద్యం చేసుకుంటూ-లేక లేక కలిగిన నన్ను అల్లారుముద్దుగా పెంచసాగాడు. నాపైనున్న వాత్సల్యంచే నన్ను సేద్యంలో ప్రవేశపెట్టకుండా ఉన్నతవిద్యాధికుడిని చెయ్యాలనివువ్విళ్ళూరాడు. నేను బి. యే. ప్యాసయేటప్పటికి నా ఖర్చువలన పదిఎకరాలు రెండుఎకరాలయ్యాయి.

కాలేజీలో కాలుపెట్టక ముందునుంచే నాకు సారస్వతపిచ్చి పట్టింది. చదువుకంటే ఎక్కువ కాలాన్ని కథలు వ్రాయడానికే వినియోగించేవాణ్ణి. నేను బి. యే. ప్యాసయి గొప్పవుద్యోగస్థుడౌతానని నాతలిదండ్రులు యెన్నోకష్టాల ననుభవించి నాకు చదువు చెప్పించారు. కాని వారు తొలుతగానే నన్ను సేద్యంలోచేరిస్తే అవున్న పదిఎకరాలకు మరో అయిదెకరాలు చేర్చేవాణ్ణేమో! అలా కాకపోగా వున్నపొలం హారతికర్పూరంలా హరించి పోయింది.

''నేనేదో తమను ఉద్ధరిస్తానని కలలుగన్న మా తలిదండ్రుల కలలు పగటికలలే అయ్యాయి.

కారణం ఏమంటారా రచయిత జీవితాన్ని చవి చూచిన నేను—బానిసవలె ఒకరిక్రింద నౌకరీచేయ లేకపోయాను. ఆఖరికి యెంతో పట్టుదలతో ఒక ఆఫీసులో గుమస్తాగా చేరాను. కాని పనిచేసింది పట్టుమని పదిరోజులైనా లేదు.

మెల్ల మెల్లగా 'నా' అన్నవారంతా నను వీడి మరో సుఖమయ ప్రపంచానికి చేరుకున్నారు. ఏకాకినైన నేను ఎంతో ప్రశాంతంగా నాతండ్రి తన రెక్కలతో కష్టించి ఆర్జించి మిగిల్చిపోయిన ఆ రెండెకరాల భూమి ఆధారంతో బ్రతుకును వెళ్ళబుచ్చసాగాను. అప్పుడు కొన్నవే యీ గ్రంథాలు.

కూర్చుని తింటుంటే ఎంతకాలం వుంటుందా కొంచెం భూమి? దుర్భిక్షాలొస్తే ఎలాగో వెళ్ళబుచ్చవచ్చుగాని పుస్తకాలు కొనాలి—యింకా సాహిత్య పరిశోధన ప్రయాణం—టిక్కెట్టుకి ఎలా సరిపోతుంది వచ్చే ఆదాయం?

పోనీ యింతకష్టపడి ఎంతో అమూల్యమైనవి రచించి వాటికేమైనా ఆర్జించి పెడ్తేనా అంటే—రచయితగా నేను యింతవరకూ సంపాదించినది పదిరూపాయలైనా వుండవు. మరి యెందుకు రచయితగా బ్రతకడం?

ఇంక గత్యంతరం లేక పెట్టిన తనఖాలకు ఆభూమిని వదలివేసి దేశదిమ్మరిగా తిరగ నారంభించా. ఈనాటికి మూడురోజులనుండి నా కడుపు దమ్మిడీ ఖర్చులేని పంపునీళ్ళతో నిండుతోంది. ఎన్ని బాధలనైనా సహించాను గాని యీ గ్రంథాలను విక్రయించడానికి బాధపడ్డాను. కాని, యిక తప్పని సరివచ్చి మీవద్దకువచ్చాను అన్నాడు ఆయాసంతో.

మిత్రమా !


చూచావా మన రచయితల దుస్థితి ఎలా వుందో! "ఏమీ వ్రాయడంలేదే ?" అని ప్రశ్నించావు. ఎందుకు వ్రాయాలి? ఎవరికోసం వ్రాయాలి? మనం ఎవరికొరకు వ్రాస్తున్నామో వారు అసలు పత్రికలే చదవరు. పోనీ ఆర్థికంగా ఏమైనా తోడ్పడునా అంటే యితరవిధంగా సంపాదించుకున్న పైసాలను హృదయోద్వేగాన్ని ఆపుకోలేక కాగితాలకు పోస్టల్ వారికి తగలెయ్యాలి. ఇంతేగా మన రచనలవలన కలిగే ఫలితం ?

రోజురోజుకు కలిగే యిటువంటి భావాలతో రచయితగా బ్రతకడం చాల బాధగావుంది. ఇప్పటికే లేఖ చాలా పెరిగింది. సెలవు.

నీమిత్రుడు
"గిరి"


శక్తి

అత్యుత్తమ సువాసన వక్కపొడి



* ప్రతిచోటా దొరకును.

* ఏజంట్లులేని చోట్లలో ఏజంట్లు కావలెను.

శక్తి పరమేశ్వర్ కంపెని

*Props*: B. R. N. K. J. S. K. Co.,

26, మహల్ రెండోవీధి, మధుర.